సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 16 । జూలై । 2024



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 723 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.48

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.48, కనిష్టంగా రూ.25 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
28.8°/ 22.3°

జిల్లాలో సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

- డీఈఓ మీనాక్షి ఆదేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

నల్లమాడ: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని జిల్లా విద్యాధికారి మీనాక్షి ఆదేశించారు. సోమవారం ఆమె నల్లమాడలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలతో పాటు స్టోరు రూం, వంట గది, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కూరగాయలను పరిశీలించి తాజాగా ఉండేలా చూసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను ఆరా తీశారు. బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. డీఈఓ వెంట ఎంఈఓలు వేమనారాయణ, సురేష్ బాబు, పాఠశాల హెచ్‌ఎం సతీష్ ఉన్నారు.

డిగ్రీ ఫలితాల విడుదల




ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం వర్సిటీలో రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు ఫలితాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ దరఖాస్తుకు ఈ నెల 31 తుది గడువుగా నిర్దేశించామన్నారు. మొత్తం 10,906 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 8,468 (77.65 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బీఏ కోర్సులో 908 మందికి గానూ 621 మంది (68.39 శాతం), బీబీఏలో 871 మందికి 436 మంది (50.06 శాతం), బీసీఏలో 28 మందికి 27 మంది, బీకాంలో 4,621 మందికి 3,051 మంది, బీఎస్సీ 4,478 మందికి 4,333 (96.76 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ఫలితాల ప్రకటన కమిటీ సభ్యులు ప్రొఫెసర్ జి. శోభాలత, డాక్టర్ పి. శంకరయ్య, డాక్టర్ డి. జయరామిరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 33 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో నీరు 33.074 టీఎంసీలకు చేరింది. సోమవారం ఉదయం 16,142 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 10 రోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గాను 33.074 టీఎంసీల వరకూ నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,607.59 అడుగుల నీరు ఉంది. అవుట్‌ఫ్లో 211 క్యూసెక్కులు నమోదవుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో డ్యాంకు వరద ఆశించిన స్థాయిలో రావడం లేదు.



"మేము అధికారంలోకి వచ్చాక రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం. ఇందులో భాగంగా ప్రతి కుటుంబంలోనూ చదువుకున్న వారికి ఉద్యోగం కల్పిస్తాం. అప్పటి దాకా నిరుద్యోగులకు ప్రతినెలా రూ. 3 వేలు భృతి ఇస్తాం"

ఇటీవల ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మొదలుకుని గ్రామాల్లో ఉండే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల హామీ ఇది. ఇదే అంశాన్ని కూటమి పార్టీలు మేనిఫెస్టోలోనూ పొందుపరిచాయి. కానీ అధికార పగ్గాలు చేపట్టి నెలన్నరవుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో జిల్లాలోని లక్షలాది మంది నిరుద్యోగులు భృతి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

- ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఆశలు కల్పించిన చంద్రబాబు
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ
- అప్పటిదాకా నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ. 3 వేలు ఇస్తామని భరోసా
- అధికారంలోకి వచ్చినా ఇప్పటిదాకా ఎలాంటి ప్రకటనా చేయని ప్రభుత్వం
- గతంలోనూ రూ. 2 వేలు భృతి ఇస్తామంటూ మమ అనిపించిన వైనం
- మారానన్న బాబు మాట నిలబెట్టుకోవాలంటున్న నిరుద్యోగులు

భృతి.. అంతా భ్రాంతి!



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడి పేరు రాజశేఖర్. పెనుకొండ మండలం మావటూరు స్వగ్రామం. 2015లో డిగ్రీ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్నాడు. గతంలో చంద్రబాబు నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చినా... రాజశేఖర్‌కు అందలేదు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఆ విధంగా తన అర్హతకు తగ్గ ఉద్యోగం ఇప్పించాలని, లేదంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలని రాజశేఖర్ కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి నెల దాటినా నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదని, 2014–19లోనూ చంద్రబాబు ఇలాగే యువతను నిరుద్యోగ భృతి పేరుతో మోసం చేశారని రాజశేఖర్ చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా నిరుద్యోగ భృతి ఇస్తారని తనలాగే లక్షలాది మంది యువత గంపెడాశలతో ఎదురు చూస్తున్నారంటున్నారు.

సాక్షి, పుట్టపర్తి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా.. నేతల హామీలు కార్యరూపం దాల్చలేదు. తాము అధికారంలోకి రాగానే.. ఇంటికో ఉద్యోగం.. లేదంటే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. నేటి దాకా ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో నిరుద్యోగ భృతి..అంతా భ్రాంతియేనా అని యువత వాపోతోంది.

ఆరు లక్షల మంది ఎదురుచూపులు..

జిల్లాలో 6,09,316 ఆవాసాలున్నాయి. 5,62,784 మంది రేషన్ కార్డుదారులున్నారు. ప్రతి ఇంట్లో చదువుకున్న వాళ్లు ఉన్నారు. చాలా నివాసాల్లో నిరుద్యోగులు ఉన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం జిల్లాకు సుమారు ఆరు లక్షల ఉద్యోగాలివ్వాలి. లేదంటే ఆరు లక్షల మందికి నిరుద్యోగ భృతి కింద ప్రతి నెలా రూ.3 వేల చొప్పున డబ్బు జమ చేయాలి. ఉద్యోగాలు దొరకని నిరుద్యోగులు భృతి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. చంద్రబాబు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇంకెన్నాళ్లు నిరీక్షణ..

అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అమలు చేస్తామని వాగ్దానం చేసిన చంద్రబాబు.. సీఎంగా బాధ్యతలు చేపట్టినా.. ఇప్పటి వరకు ఇంటికో ఉద్యోగంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగం లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, ఆ దిశగా కూడా ఎలాంటి ప్రకటనలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ప్రజలను మోసం చేస్తారేమోనని భయంగా ఉందని చెబుతున్నారు.

మళ్లీ పాత కథేనా..?

2014 ఎన్నికల ముందు కూడా ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇస్తామని, అప్పటిదాకా ప్రతినెలా రూ. 2 వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు.... అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ ఊసే ఎత్తలేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. తీరా 2019 ఎన్నికలకు ముందు రెన్నెళ్ల రూ. వెయ్యి చొప్పున, ఒక నెల రూ. 2 వేలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రకటించిన రూ. 3 వేలు భృతి అమలులో కూడా పాతరోజులు గుర్తుకొస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జిల్లాలోని ఇళ్ల సంఖ్య	
నియోజకవర్గం	ఇళ్ల సంఖ్య
కదిరి	1,02,725
పుట్టపర్తి	88,352
హిందూపురం	93,859
మడకశిర	86,724
పెనుకొండ	95,321
ధర్మవరం	1,02,052
రాప్తాడు (రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి)	40,283
మొత్తం	6,09,316

మోసం చేయకండి బాబూ



గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో (2014–2019) నిరుద్యోగులకు భృతి పేరుతో నమ్మించి నట్టేట ముంచారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలోనూ నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. ఇంతవరకు ఈ పథకం అమలుపై ఎలాంటి మార్గదర్శకాలను విడుదల చేయకపోవడం చూస్తే అనుమానం కలుగుతోంది. ఓటు వేయించుకుని ఆ తర్వాత మోసం చేయడం చంద్రబాబు నైజం. ఈసారి కూడా అలా మోసం చేయవద్దని కోరుతున్నా.

– మాతంగి రామాంజనేయులు, నిరుద్యోగి, బత్తలపల్లి.

నిరుద్యోగ భృతి హామీ నెరవేర్చాలి



నేను 2016లోనే బీకాం కంప్యూటర్స్ పూర్తి చేశాను. ఏ ఉద్యోగం దొరక్క ఇంటి వద్దే ఉంటున్నా. కూటమి నేతలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇస్తే ఎంతో ఆశపడ్డాను. అయితే అధికారంలోకి వచ్చి నెలన్నర అవుతున్నా.. నిరుద్యోగుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. హామీ మేరకు నిరుద్యోగ భృతి మంజూరు చేస్తే నా కుటుంబ పోషణకు కొంత వరకు ఉపయోగపడుతుంది.

– ప్రశాంత్‌కుమార్, కల్లూరు, లేపాక్షి మండలం

నా భర్తను దూరం చేశారు

- కులాంతర వివాహం చేసుకున్నానని వేధిస్తున్నారు
- అత్తింటి వారిపై ఫిర్యాదు చేసిన యువతి
- న్యాయం చేయాలని 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అర్జీ



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ విష్ణు

పుట్టపర్తి టౌన్: భర్త దూరమైన తనను కులాంతర వివాహం చేసుకున్న వ్యక్తి..ఇప్పుడు వదిలించుకునేందుకు సిద్ధమయ్యాడని, తనకు న్యాయం చేయాలని ధర్మవరానికి చెందిన దేవరకొండ శ్రావణి అడిషనల్ ఎస్పీ విష్ణు ఎదుట వాపోయింది. ఈ మేరకు సోమవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించింది. ఎరికల కులానికి (ఎస్టీ)చెందిన తనకు గతంలో అనంతపురానికి చెందిన ఈశ్వరయ్యతో వివాహమైందని, ఒక కుమార్తె కూడా ఉందన్నారు. అయితే 9 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో ఈశ్వరయ్య మృతి చెందగా, ధర్మవరానికి చెందిన అతని స్నేహితుడు ఆర్.విష్ణు గణేష్ తనను శారీరకంగా వాడుకున్నాడని శ్రావణి వాపోయింది. తన కుటుంబీకులు బలవంతం చేయడంతో తాళి కట్టాడని పేర్కొంది. అనంతరం కనపడకుండా వెళ్లి పోయాడని, కుటుంబ సభ్యులు అతన్ని దాచిపెట్టారని, అడిగేందుకు వెళ్లగా తనను కులం పేరుతో అసభ్యకరంగా దూషిస్తున్నారని తెలిపింది. తన భర్త విష్ణుగణేష్‌ను తనకు అప్పగించడంతో పాటు తన భర్త తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల నుంచి రక్షణ కల్పించాలని కోరింది. స్పందించిన అడిషనల్ ఎస్పీ వెంటనే ధర్మవరం పోలీసులకు ఫోన్ చేశారు. విచారణ జరిపి న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై 18 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా స్టేషన్‌లకు పంపారు. ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ విష్ణు పోలీస్ అధికారులను ఆదేశించారు.

నా భర్త నుంచి రక్షణ కల్పించండి

నాకు హిందూపురం మండలం చలవెందలకు చెందిన జిలాన్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. మేము పేదవారిమైనా రూ.6 లక్షలు ఖర్చు చేసి వివాహం చేశారు. నా భర్త అక్రమ సంబంధం పెట్టుకొని అదనపు కట్నం కోసం నన్ను వేధిస్తున్నాడు. నాకు ప్రాణహాని ఉంది. నా భర్త వేధింపులపై గతంలోనే హిందూపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశా. న్యాయం జరగలేదు. నా భర్త నుంచి నాకు రక్షణ కల్పించాలి.

– జబేరియా, హిందూపురం

ఎన్నికల్లో పనిచేసినా డబ్బులివ్వలేదు

- కలెక్టర్ చేతన్ ఎదుట వాపోయిన వీడియో, ఫొటోగ్రాఫర్లు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 265 అర్జీలు



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న వీడియో, ఫొటో గ్రాఫర్లు

పుట్టపర్తి అర్బన్: 'సార్వత్రిక ఎన్నికల్లో రేయింబవళ్లు పనిచేశాం. అయినా ఇప్పటివరకూ మాకు ఇవ్వాల్సిన రెమ్యునరేషన్ ఇవ్వలేదు. మా రెక్కల కష్టంతోనే మా కుటుంబమంతా బతుకుతోంది. ఇప్పటికైనా మాకు రావాల్సిన మొత్తం వెంటనే ఇప్పించండి'' అని ఎన్నికల సమయంలో పనిచేసిన వీడియో, ఫొటో గ్రాఫర్లు కలెక్టర్ టీఎస్ చేతన్‌ను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమానికి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 265 అర్జీలు అందాయి. కలెక్టర్‌తో పాటు జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు అర్జీలను స్వీకరించారు.

ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లాలి..

మండల ప్రత్యేకాధికారులు ప్రతి శుక్రవారం సచివాలయాలు, పాఠశాలలు, హాస్టళ్లు, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులను తనిఖీ చేసి సమస్యలను గుర్తించడంతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఆయన అధికారులతో మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తమ శాఖపై పూర్తిస్థాయిలో పట్టుసాధించాలన్నారు. ఏ సమస్య అయినా సదరు శాఖను దాటి కలెక్టరేట్ వరకూ రాకూడదన్నారు. అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇందుకోసం అధికారులు శ్రద్ధ, అంకిత భావంతో పని చేయాలన్నారు. విధుల్లో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యాన్ని సహించబోనన్నారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందిన అర్జీల పరిష్కారంపై ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకూ ర్యాండమైజేషన్ చెక్ ఉంటుందన్నారు. అందువల్ల ఆయాశాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిరంతరం పనిచేసేలా కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. పరికరాల కోసం అర్హులైన విభిన్న ప్రతిభావంతుల జాబితా సిద్ధం చేయాలన్నారు.

అందిన అర్జీల్లో కొన్ని ఇలా...

- తనకు 90 శాతం అంగవైకల్యం ఉన్నా, అధికారులు రూ.6 వేల పింఛనే ఇచ్చారని కదిరి 31వ వార్డుకు చెందిన రమేష్ కలెక్టర్‌కు తెలిపారు. తమ కుటుంబం పరిస్థితి దారుణంగా ఉందని, పింఛన్ మొత్తం రూ.15 వేలు ఇచ్చే విధంగా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారి వెంకటరాముడిని పిలిచి వివరాలు సేకరించి ఇవ్వాలని ఆదేశించారు.
- మహారాష్ట్రలోని శిరిడీలో జరిగే అంతర్జాతీయ రోప్ జంప్ పోటీల్లో పాల్గొనే అవకాశం తనకు వచ్చిందని, కానీ అందుకు తగ్గ ఆర్థిక వనరులు తనవద్ద లేవని నల్లమాడకు చెందిన తాహీర్ కలెక్టర్‌కు తెలిపారు. తన కుటుంబ పరిస్థితి కూడా బాగోలేదని, పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక చేయూత ఇవ్వాలని కోరారు. తప్పకుండా జిల్లాకు పేరు తీసుకు వస్తానన్నారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

తల్లితో సంబంధం.. కుమార్తెపై అత్యాచారం

- తల్లి నుంచి అతనికి.. అతని నుంచి కుమార్తెకు హెచ్‌ఐవీ
- ఇప్పటికే తల్లి మృతి
- అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు
- అధికారుల సంరక్షణలో బాధిత బాలిక

హిందూపురం అర్బన్: భర్త చనిపోవడంతో తనకొక తోడు కావాలనుకున్న ఆమె మరొక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తనకు హెచ్‌ఐవీ ఉందన్న విషయాన్ని దాచిపెట్టి అతనితో సహజీవనం చేసింది. దీంతో అతనికీ వైరస్ సోకింది. ఆరోగ్యం విషమించి కొంతకాలం క్రితం ఆమె చనిపోయింది. అయినప్పటికీ ఆమె కుమార్తె అతన్నే తండ్రిగా భావించి కలసి ఉండేది. దీన్ని ఆసరాగా చేసుకున్న ఆ నీచుడు మృగాడిలా మారాడు. కన్న బిడ్డ లాంటి బాలికపై అత్యాచారం చేశాడు. అన్యం పుణ్యం ఎరుగని ఆ బాలికకూ వ్యాధి అంటించాడు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హిందూపురం పట్టణంలోని రహమత్‌పూర్‌కు చెందిన సుమారు 53 ఏళ్ల వ్యక్తికి ముద్దిరెడ్డిపల్లిలో ఉండే మహిళ పరిచయమైంది. అప్పటికే ఆమెకు వివాహమై..అనారోగ్యంతో భర్త చనిపోయాడు. కుమార్తె ఉంది. ఆమె నిస్సహాయతను ఆసరాగా చేసుకున్న సదరు వ్యక్తి అన్నివిధాలా అండగా ఉంటానని నమ్మించాడు. ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. ఆమెకు అప్పటికే హెచ్‌ఐవీ ఉన్నప్పటికీ ఆమె కూడా ఆ విషయాన్ని దాచిపెట్టి అతనితో సహజీవనం చేసింది. అతను, ఆమె, ఆమె కుమార్తె ముగ్గురూ కలసి రెండేళ్లుగా స్థానిక మోడల్ కాలనీలో ఉండేవారు. వ్యాధి ముదరడంతో కొంతకాలం క్రితం ఆమె చనిపోయింది. ఇక ఏ దిక్కూలేని 14 ఏళ్ల కుమార్తె అతని వద్దే ఉండిపోయింది. అతను కూడా కొన్ని రోజుల తర్వాత అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో సదరు బాలిక ప్రతినెలా బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించేది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూన్ పదో తేదీన బత్తలపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడి వైద్యులు అనుమానంతో అతనికి హెచ్‌ఐవీ పరీక్ష చేయించారు. అతనికీ వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. వెంట తీసుకువచ్చిన బాలికకు కూడా వైద్యపరీక్షలు చేయించగా..ఆమెకూ వ్యాధి సోకినట్లు తేలింది. అతను తనను నమ్మించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె వైద్యులకు తెలిపింది. దీంతో ఆర్డీటీ వైద్యులు వెంటనే బత్తలపల్లి పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పటికే అతను తప్పించుకుని వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బత్తలపల్లి పోలీసులు..ఈ కేసును హిందూపురం రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఆర్డీటీ సహకారంతో బాధితురాలిని బాలికా సంరక్షణ విభాగం అధికారులకు అప్పగించారు. తరువాత ఓ పాఠశాలలో చదువుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా.. నిందితుడు హిందూపురంలోని ఎల్‌ఐసీ కార్యాలయ సమీపంలో ఈ నెల 13న పోలీసులకు చిక్కాడు. అతన్ని అరెస్ట్ చేసి.. రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మృతిపై ఆర్డీఓ విచారణ



మహిళ మృతిపై విచారణ చేస్తున్న ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ

తనకల్లు: కొక్కంటిక్రాస్‌లోని ఎంఆర్ ప్రైవేట్ క్లినిక్ నిర్వాహకుడు, ఆర్‌ఎంపీ అబ్దుల్లా ఇచ్చిన ఇంజక్షన్ వికటించి ఉత్తమ్మ అనే మహిళ మృతి చెందిన ఘటనపై కదిరి ఆర్డీఓ ఎం. సన్నీ వంశీకృష్ణ సోమవారం విచారణ చేశారు. తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, పోలీస్ అధికారులు, ఆరోగ్య సిబ్బందితో పాటు ఆర్‌ఎంపీ అబ్దుల్లాను వేర్వేరుగా విచారించి వివరాలను సేకరించారు. సమగ్ర వివరాలతో నివేదిక రూపొందించి కలెక్టర్‌కు పంపనున్నట్లు వెల్లడించారు.

సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

స్థానిక 30 పడకల ప్రభుత్వాస్పత్రి (సీహెచ్‌సీ)ని ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నట్లు కొందరు స్థానికులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వారంలో ఒకరోజు సీహెచ్‌సీని తనిఖీ చేయాలని తహసీల్దార్ శోభ సువర్ణమ్మను ఆదేశించారు. అనంతరం ఆస్పత్రి రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు.



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

ప్రైవేట్ క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న ప్రైవేట్ క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ శోభా సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఉత్తమ్మ మృతికి కారణమైన ఆర్‌ఎంపీపై కఠిన తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో వీసీ ద్వారా మాట్లాడారు. ప్రతి ఇంటికీ కొలతలు తీసి, వాటి ఆధారంగా పన్ను వసూలు చేయాలని పేర్కొన్నారు. పన్నుల వసూళ్లలో జిల్లా ప్రగతి 64 శాతం ఉందని, ఈనెల 30వ తేదీ నాటికి వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. దీనికి పంచాయతీ సెక్రెటరీలు పూర్తి బాధ్యత వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. లోకోస్ యాప్ నిర్వహణలో బుక్కపట్నం, ముదిగుబ్బ, కొత్తచెరువు ,నల్లమాడ అధికారులు వెనకబడి ఉన్నారని, వెంటనే ప్రగతి చూపాలన్నారు. లక్పతి దీదీల ఎంపికలో ప్రమాణాలు పాటించాలన్నారు. రూ.లక్షలోపు సంవత్సర ఆదాయం కలిగిన స్వయం సహాయ సంఘాల సభ్యులను ఎంపిక చేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.



వీసీ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

క్లుప్తంగా

అనారోగ్యంతో పీడీ మృతి


లక్ష్మీపతినాయక్ (ఫైల్)

నల్లమాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.లక్ష్మీపతినాయక్ (56) మృతిచెందారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయనకు భార్య గీత, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న నల్లమాడ, రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు... లక్ష్మీపతినాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రెపిల్లలు

ధర్మవరం రూరల్: మండలంలోని రావులచెరువులో సోమవారం 40 గొర్రె పిల్లలను కుక్కలు కొరికి చంపాయి. బాధిత కాపరులు వెంకటనారాయణ, బాలగుండ్ల నారాయణస్వామి, సుధాకర్ తెలిపిన మేరకు... సోమవారం ఉదయం గొర్రె పిల్లలను గూడు కింద వేసి తల్లి గొర్రెలను మేపునకు బయలు ప్రాంతానికి తోలుకెళ్లారు. ఆ సమయంలో గూడు కిందకు చొరబడిన వీధి కుక్కలు 40 పిల్లలను కొరికి చంపాయి. దీంతో దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లింది. నష్టపోయిన తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని బాధిత కాపరులు డిమాండ్ చేశారు.

టిప్పర్‌ను ఢీకొన్న బొలెరో


ప్రమాదానికి గురైన వాహనాలు

బత్తలపల్లి: టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో బొలెరో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరి నుంచి బత్తలపల్లి వైపు సోమవారం వస్తున్న టిప్పర్ బత్తలపల్లి మండలం సూర్యచంద్రాపురం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో ఢీకొంది. ప్రమాదంలో బొలెరో డ్రైవర్ గంగాధర్ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. అతి కష్టంపై స్థానికులు ఆయనను కాపాడి బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రునితో వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి


చెన్నప్ప (ఫైల్)

కొత్తచెరువు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు చెన్నప్ప(48) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. కొత్తచెరువు మండలం ఎర్రబల్లి గ్రామానికి చెందిన చెన్నప్ప... 20 సంవత్సరాలుగా హోంగార్డుగా పుట్టపర్తి, కొత్తచెరువు పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. కొన్ని సంవత్సరాలుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన 20 రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చేరారు. చికిత్సకు స్పందించక సోమవారం ఉదయం ఆయన మృతి చెందారు. కాగా, చెన్నప్పకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భద్రతకు 'లైసెన్స్'

- హిందూపురానికి చెందిన నరేష్ ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్త బైక్ కొన్నాడు. అయితే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడాన్ని నిర్లక్ష్యం చేశాడు. మార్చిలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) లేక పోవడంతో ఇన్సూరెన్స్, ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. దీంతో ఆయన కుటుంబం ఆర్థిక చిక్కుల్లో పడింది.

.... ఈ పరిస్థితి కేవలం నరేష్ ఒక్కడిదే కాదు... ఇలాంటివి ఎన్నో సంఘటనలు జిల్లాలో వెలుగు చూస్తున్నాయి. కేవలం డీఎల్ లేకపోవడం వల్లనే మృతుల కుటుంబాలకు ఎలాంటి 0పరిహారం దక్కకపోవడం గమనార్హం.

- ఇంటి నుంచే ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు అవకాశం
- డ్రైవింగ్ లైసెన్స్‌తో ప్రయోజనాలు ఎన్నో
- జిల్లాలో ఏటా 4వేల లైసెన్స్‌ల జారీ



హిందూపురం అర్బన్: వాహనదారులకు ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. గతంలో ప్రజల ముంగిట రవాణా శాఖ పేరుతో మేళాలు నిర్వహించి ఒక్కో శాఖలో పనిచేస్తూ డీఎల్ లేని వారిని గుర్తించి మరీ లైసెన్సు జారీ చేశారు. ప్రతి కళాశాలకు వెళ్లి డ్రైవింగ్ లైసెన్స్ ప్రాధాన్యతపై ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. జిల్లాలో హిందూపురంలో జిల్లా రవాణా కార్యాలయం ఉండగా కదిరిలో ఎంవీఐ కార్యాలయం ఉంది. గతంలో డ్రైవింగ్ లైసెన్స్ కోసం కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరుగాడే వారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ సేవలను ప్రభుత్వం చేరువ చేయడంతో మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం దక్కింది. తాజాగా ఇంటర్నెట్‌పై అవగాహన ఉన్నవారు ఇంటి నుంచే ఎల్ఎల్ఆర్ కోసం దరఖాస్తు చేయవచ్చు. స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఎంవీఐ కార్యాలయాల్లో నిర్వహించే కంప్యూటర్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఎల్ఎల్ఆర్ జారీ చేస్తారు. నెల రోజుల తర్వాత అధికారుల ఎదుట వాహనాలు సక్రమంగా నడిపి డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందవచ్చు. హిందూపురం రవాణా కార్యాలయంతో పాటు కదిరిలో నిత్యం 70 నుంచి 80 మంది వరకూ ఎల్ఎల్ఆర్, డీఎల్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో 90 శాతం మంది అక్షరాస్యులే ఉన్నా సరైన పరిజ్ఞానం లేక కంప్యూటర్ టెస్ట్‌లో 20 శాతం మంది చతికిలబడుతున్నారు. ఈ లెక్కన ఏటా 10వేల మందికి జిల్లాలో డీఎల్‌లు జారీ అవుతున్నాయి.

వచ్చీ రాని డ్రైవింగ్‌తో...

యాంత్రిక జీవనంలో ప్రతి కుటుంబంలోనూ ఒకటి లేదా రెండు ద్విచక్ర వాహనాలు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఈ క్రమంలో చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ద్విచక్ర వాహనం వేసుకుని రయ్యిమంటూ రోడెక్కేస్తున్నారు. అయితే వీరిలో అత్యధికులు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడంలో అంతులేని నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లైసెన్స్ విలువ ఏమిటో తెలుసుకునేలోపే పూర్తి స్థాయిలో నష్టపోతున్నారు. అంతేకాక వచ్చీరాని డ్రైవింగ్‌తో ఎదుటి వారి ప్రాణాలకు భరోసా లేకుండా చేస్తున్నారు.

లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే..

లైసెన్స్ లేకుండా రోడెక్కితే జరిగి పరిణామాలపై అటు న్యాయమూర్తులు, ఇటు పోలీస్ అధికారులు నిత్యమూ పెద్ద ఎత్తున ప్రజలను అవగాహన పరుస్తున్నారు. సరైన శిక్షణ లేకుండా వాహనాలు నడపడం వల్ల వారితో పాటు ఎదురుగా వచ్చే వారినీ ప్రమాదాల బారిన పడేస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాద మృతులకు ప్రభుత్వం అందంచే ప్రమాద బీమా వర్తించకుండా పోతోంది. ప్రమాదంలో మరణించిన వారికి ఇచ్చే రెట్టింపు బీమా అందదు. క్షతగాత్రులకు మెరుగైన సేవలు ఉండవు. అంతే కాక ప్రాణాలతో బయట పడితే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు.

వాహనాలు నడిపేందుకు అర్హతలివే..

గేర్లు లేని 50 సీసీ లోపు ద్విచక్ర వాహనాలను నడిపేందుకు 16 ఏళ్ల వయస్సు తప్పనిసరి. అయితే దీనికి తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి అనుమతి కలిగి ఉండాలి. గేర్లు ఉన్నా, లేకున్నా... 50 సీసీ కంటే సామర్థ్యం ఎక్కువ కలిగిన వాహనాలు నడిపేందుకు డీఎల్ తప్పనిసరి. కారు, జీపు నడపాలంటే తప్పని సరిగా 19 ఏళ్లు నిండి ఉండాలి. ఇక లారీ, బస్సులు నడపాలంటే 20 ఏళ్లు నిండి ఉండాలి. హెవీ వెహికల్ లైసెన్స్‌తో పాటు ఏడాది అనుభవం ఉండాలి.

లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరం



వాహనం నడపాలంటే లైసెన్స్ తప్పని సరిగా కలిగి ఉండాలి. డ్రైవింగ్ నేర్చుకున్న వారిలో కొందరు లైసెన్స్ తీసుకోవడాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. డ్రైవింగ్ నిబంధనలు తెలుసుకుని మొదట ఎల్ఎల్ఆర్ పొందిన తర్వాత 30 రోజులు నుంచి ఆరు నెలల్లోపు పూర్తి స్థాయి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి. 18 ఏళ్లు నిండకనే పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. ఇది తప్పు. పిల్లలు ఏదైనా ప్రమాదం బారిన పడితే తల్లిదండ్రులు శిక్షార్హులవుతారు.

– కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి, హిందూపురం

చిరుత దాడిలో మేక మృతి


మృతి చెందిన మేక

మడకశిర రూరల్: మండలంలోని మెళవాయి గ్రామ శివారులోని లక్కమ్మ ఆలయం వద్ద మేకల మందపై చిరుత దాడి చేసింది. సోమవారం ఉదయం కాపరి గుడిసింటి హనుమంతప్ప తన మేకలను మేపునకు తోలుకెళ్లాడు. సాయంత్రం ఆలయం సమీపంలోకి చేరుకోగానే పొదల్లో నుంచి దూసుకొచ్చిన చిరుత ఓ మేకను నోట కరుచుకుని లాక్కెళ్లింది. గమనించిన కాపరి గట్టిగా కేకలు వేస్తూ బెదిరించడంతో చిరుత పరుగు తీసింది. అప్పటికే మేక మృతిచెందింది. ఘటనతో దాదాపు రూ.20 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

కారు ఢీ.. వ్యక్తికి గాయాలు

నల్లచెరువు: కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. నల్లచెరువు మండలం వి.రమణప్పగారిపల్లి అంబేడ్కర్ కాలనీకి చెందిన తిరుమలేష్ సోమవారం వ్యక్తిగత పనిపై నల్లచెరువుకు వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన... సంతతోపు వద్దకు చేరుకోగానే మదనపల్లి వైపు నుంచి కదిరి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తిరుమలేష్‌ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించిన ఎంపీ


ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు జ్ఞాపికను అందజేస్తున్న వీసీ ఎస్‌ఏ కోరి

అనంతపురం/బుక్కరాయసముద్రం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోమవారం సందర్శించారు. జేఎన్‌టీయూ (ఏ)లోని ఇంక్యుబేషన్ కేంద్రంలో ఉన్న వైస్ చాన్సలర్ కార్యాలయంలో ఆయనకు వీసీ ఎస్ఏ కోరి సాదర స్వాగతం పలికారు. 2018లో వర్సిటీ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకూ సాధించిన పురోగతిని వివరించారు. జంతలూరు వద్ద ఏర్పాటు చేయబోయే శాశ్వత క్యాంపస్‌పై చర్చించారు. ఆగస్టు నుంచి శాశ్వత క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తామని వీసీ తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరం నుంచి అదనంగా 12 కొత్త కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరు సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టామన్నారు. ప్రస్తుతం 20 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వర్సిటీలో చదువుతున్నారని పేర్కొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. మైనింగ్, సోషియాలజీ, టెక్స్‌టైల్స్, జియాలజీ, ఆంత్రోపాలజీ వంటి కోర్సులూ ప్రవేశపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ ప్రొఫెసర్ సి.షీలారెడ్డి, పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ యు.ఉమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్ రద్దు చేయాలి


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి


నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘం నాయకులు

పుట్టపర్తి: ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ నేత చంద్రబాబు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే తుంగలో తొక్కారంటూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బుక్కచెర్ల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. విజయవాడ కేంద్రంగా సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా సాగుతున్న సమావేశంలో సోమవారం ఆయన ప్రసంగించారు. సమావేశాలకు జిల్లా నుంచి సంఘం నేతలు చిదంబర్‌రెడ్డి, గోపీకృష్ణ, రమణారెడ్డి, నారాయణస్వామి తదితరులు హాజరయ్యారు. అనంతరం సమావేశంలో చేసిన తీర్మానాలపై సోమవారం ప్రకటన విడుదల చేశారు. జీపీఎస్‌పై విడుదల చేసిన గెజిట్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, డీఎస్సీ–98 ఉపాధ్యాయుల వయోపరిమితని 62 ఏళ్లకు పెంచాలని, మెరుగైన ఐఆర్, పీఆర్సీ ప్రకటించాలని, అన్ని క్యాడర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ నెల వారీ పదోన్నతులు కల్పించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. కేజీబీవీలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు మినిమమ్ టైం స్కేల్ వర్తింప చేయాలన్నారు. సమగ్ర శిక్షలో పని చేసే సిబ్బందికి వేతనాలు ప్రతి నెలా సక్రమంగా అందజేయాలన్నారు.

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతుల దగ్ధం

పెనుకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను పలువురు ఉద్యోగులు దహనం చేశారు. ఏపీసీపీసీ పెనుకొండ జోన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ మల్లికార్జున, రంగేష్‌కుమార్ తదితరులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, వెంకటరమణ, చంద్రమౌళి, సజ్జరాయప్ప, చంద్ర, వెంకటేష్, శ్రీనివాసులు, సోమశేఖర్, రఘునాథ్, సంజవ్, సురేంద్ర ఓబులేసు, సురేంద్రరెడ్డి, ట్రెజరీ జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం లేకపోయినా అలవెన్స్!

- ఎస్కేయూలో వెలుగు చూస్తున్న అక్రమాలు
- దివ్యాంగులైన ఉద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు అదనపు అలవెన్స్
- దీంతో వైకల్యం లేకపోయినా వికలాంగుల కోటాలో అలవెన్స్ కోసం దరఖాస్తు
- ధ్రువీకరణ పత్రాలు లేకున్నా ప్రతి నెలా 25 మందికి మంజూరు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అక్రమార్కులకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఎలాంటి వైకల్యం లేకున్నా.. దివ్యాంగుల కోటాలో కొందరు ఉద్యోగులు ప్రతి నెలా అదనపు అలవెన్స్ పొందుతున్నారు. రెండు దశాబ్దాలుగా ఇది కొనసాగుతూ వస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. విషయం వెలుగు చూసిన తర్వాత ఇప్పటి వరకూ దివ్యాంగుల కోటాలో స్వాహా అయిన రూ.1.5 కోట్ల మేర అలవెన్స్‌లను రికవరీ చేయడంలో వర్సిటీ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో బురిడీ

వర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎవరికైనా వైకల్యం ఉంటే వారికి ప్రతి నెలా జీతంతో పాటు రూ.2వేలు అలవెన్స్ చెల్లిస్తారు. కేవలం సర్టిఫికెట్ ఇస్తే చాలు.. అలవెన్స్ మంజూరవుతుంది. దీంతో 50 మంది ఉద్యోగులు ఈ కోటా కింద అలవెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే 20 మంది ఉద్యోగ విరమణ చేశారు. మిగిలిన 30 మంది ప్రతి నెలా దివ్యాంగుల అలవెన్స్ పొందుతున్నారు. వీరిలో ఐదుగురు మాత్రమే నిజమైన దివ్యాంగులు. తక్కిన 25 మంది అక్రమంగా ప్రతి నెలా అలవెన్స్ తీసుకుంటున్నారు. 20 సంవత్సరాలుగా ఇదే తరహాలోనే వీరు అలవెన్స్ పొందుతున్నా.. చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనుకంజ వేయడం గమనార్హం.

పదోన్నతుల్లోనూ అక్రమాలే..

దివ్యాంగుల అలవెన్స్ తీసుకునేందుకు నకిలీ సర్టిఫికెట్లు పొందుపరిచిన వారు కనీసం సదరం సర్టిఫికెట్ ఇవ్వకపోవడం గమనార్హం. వర్సిటీలోనే రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న ఉద్యోగికి వైకల్యం ఉందో.. లేదో అనే అంశాన్ని ఇప్పటి వరకూ ఆయనతో ధ్రువీకరించలేదు. అలవెన్స్‌లను అక్రమంగా అందిపుచ్చుకోవడమే కాక... ఏకంగా పదోన్నతులు పొంది దానికి అనుగుణంగా పెద్ద మొత్తంలో దివ్యాంగ అలవెన్స్ పొందుతున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. వాస్తవానికి 70 శాతం దివ్యాంగులు అయితే అలవెన్స్ మంజూరు చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కానీ చిన్నపాటి గాయమైనా దివ్యాంగులమేనంటూ దరఖాస్తు చేసుకుని అలవెన్స్‌లు స్వాహా చేస్తున్నారు. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు నకిలీ దివ్యాంగులను గుర్తించి, వారు స్వాహా చేసిన మొత్తాన్ని రికవరీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రచార ఆర్భాటం.. విక్రయాలు శూన్యం!


రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం

అనంతపురం అగ్రికల్చర్: బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకే నాణ్యమైన సోనా బియ్యం, కంది పప్పు అందిస్తామని గొప్పగా చెప్పి స్థానిక రైతుబజార్‌లో ఈ నెల 11న ప్రారంభించిన విక్రయ కేంద్రానికి ప్రజల నుంచి ఏ మాత్రం స్పందన కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిల్లర్స్ అసోసియేషన్, మర్చంట్ అసోసియేషన్ సహకారంతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విక్రయ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ అర్భాటంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. కిలో రూ.48, రూ.49 ప్రకారం రెండు రకాల బియ్యం, కిలో కంది పప్పు రూ.160 చొప్పున ధరలు నిర్ణయించారు.

బయటి మార్కెట్‌లోనూ అదే ధర

బయటి మార్కెట్‌తో పోల్చుకుంటే ఇక్కడ ఎంత లేదన్నా కిలోపై రూ.15 నుంచి రూ.20 వరకు ధర తక్కువగా ఉంటుందని చెప్పారు కానీ, బహిరంగ మార్కెట్‌లోనూ దాదాపు అవే ధరలకు లభిస్తున్నట్లు కొనుగోలుదారులు చెబుతున్నారు. కంది పప్పుపై మాత్రం కిలోకు రూ.5 వరకు ఆదా అవుతుందంటున్నారు. .ప్రారంభం రోజు చాలా మంది రావడంతో తొలిరోజు ఓ మాదిరిగా అమ్మకాలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. రెండో రోజు నుంచి ప్రజల నుంచి స్పందన కరువైందంటున్నారు. రోజుకు ఒక క్వింటా బియ్యం, అర క్వింటా కంది పప్పు కూడా అమ్ముడుపోని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కనీసం బియ్యం కిలో రూ.40, కంది పప్పు కిలో రూ.140 ప్రకారం ఉన్నా... కొంత వరకు స్పందన ఉండేదని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొంతైనా రాయితీ భరిస్తే... ఇలాంటి వాటి వల్ల ప్రజలకు ఒకింత ప్రయోజనం చేకూరుతుందంటున్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ స్కూళ్లకే పరిమితం చేయాలి

- గిరిజన ఉపాధ్యాయ సంఘం డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: 'తల్లికి వందనం' పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుజ్జల శివయ్య, డెగావత్ రవీంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రాథమిక విద్య 1 నుంచి 5వ తరగతి వరకు మూడు కిలోమీటర్ల పరిధిలో, ప్రాథమికోన్నత విద్య 5 కిలోమీటర్ల పరిధిలో ఉండాలన్నారు. విద్యా సంస్కరణలో భాగంగా జారీ చేసిన జీఓ 117తో 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత స్థాయిలో చేర్చారన్నారు. దీనివల్ల ప్రాథమిక విద్యా విచ్ఛిన్నం అవుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే జీఓ 117 రద్దు చేసి తీరుతామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ చాలా సందర్భాల్లో చెప్పారని గుర్తు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెన్నెళ్లవుతున్నా ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఇచ్చిన హామీ మేరకు జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంగ్లిష్ మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియంనూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో అమలు చేయాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ నైపుణ్య దినోత్సవం

పుట్టపర్తి టౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకుంటే మంచి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం అన్నారు. బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నైపుణ్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తిలో జగన్నాథ రథయాత్ర


రథయాత్రలో పాల్గొన్న ఒడిశా భక్తులు

పుట్టపర్తి రూరల్: ఒడిశాకు చెందిన సత్యసాయి భక్తులు పుట్టపర్తిలో సోమవారం పూరీ జగన్నాథ రథయాత్ర నిర్వహించారు. సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వాముల వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఎనుములపల్లిలోని సత్యసాయి బాబా మందిరం నుంచి గుర్రప్ప స్వామి కొండ, గణేష్ సర్కిల్, హనుమాన్ దేవాలయం మీదుగా పురవీధుల్లో ఒడిశా సంప్రదాయాన్ని అనుసరిస్తూ భజనలు చేస్తూ రథయాత్రను శోభాయమానం చేశారు.